

ఇసుక డోర్ డెలివరీ

త్వరలో రీచ్‌ల నుంచి నేరుగా ఇంటికే సరఫరా



- కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు
- మరింత తగ్గనున్న ధర
- భీమిలి, అగనంపూడిల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు అయిపోయిన తరువాత డిపోలు ఎత్తివేత
- శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ పూర్తిగా విశాఖ జిల్లా అవసరాలకు కేటాయించాలని అధికారుల ప్రతిపాదన

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరంలో ఇసుక డోర్ డెలివరీకి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లుచేస్తోంది. శ్రీకాకుళం/రాజమండ్రిల్లో గల రీచ్‌ల నుంచి నేరుగా వినియోగదారుడి ఇంటికి చేరేలా ప్రణాళిక రూపొందిస్తుంది. ప్రస్తుతం నగర పరిధిలో గల భీమిలి, అగనంపూడిల్లో ఉన్న ఇసుక డిపోలను ఎత్తివేయనున్నారు.

విశాఖ నగర పరిధిలో నిర్మాణాలకు నెలకు సగటున 30 నుంచి 35 వేల టన్నుల ఇసుక అవసరం. ఇసుక అవసరమైనవారు తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తే... రెండు, మూడు రోజుల వ్యవధిలో నేరుగా ఇంటికే వాహనం ద్వారా పంపనున్నారు. దీని కోసం శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేకంగా ఒక రీచ్‌ను విశాఖ జిల్లాకు కేటాయించేలా చూడాలని ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం భీమిలి, అగనంపూడి డిపోల్లో ఉన్న ఇసుక అమ్మకాలు పూర్తయిన తరువాత డోర్ డెలివరీ విధానం అందుబాటులోకి తీసుకురానున్నారు. డోర్ డెలివరీ విధానం వల్ల ప్రస్తుతం ఉన్న రేటు మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. రీచ్‌ల నుంచి వినియోగదారుడి ఇంటికి ఇసుక తీసుకువచ్చేందుకు కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు నిర్ణయిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక డిపో నుంచి వినియోగదారుడి ఇంటికి రవాణాకు కిలోమీటరుకు ఇంత అని నిర్ణయించి చార్జీలు వసూలు చేసేవారు. ఈ విధానం గాడిలో పడే సమయంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో మొత్తం గందరగోళంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు నేరుగా నదుల్లోని రీచ్‌లు లేదా ఒడిశా నుంచి తెచ్చుకునేవారు.

ఇదిలావుండగా విశాఖలో ప్రధాన నదులు లేనందున శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గోదావరి నదుల్లోని రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధానంలో గందరగోళం ఏర్పడడంతో టన్ను ఇసుక ఇంటికి చేరేసరికి రూ.1,600 నుంచి రూ.1,800 వరకు ఖర్చయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు ఏజెన్సీలు నదుల నుంచి తీసుకువచ్చిన ఇసుక ఎక్కువగా డిపోల్లో ఉండిపోయింది. ఈ విధంగా విశాఖ జిల్లాలో సుమారు రెండు లక్షల టన్నులు స్టాకు ఉన్నట్టు గుర్తించారు. ఆ ఇసుకను కాంట్రాక్టర్లు నిర్ణయించిన రేటుకు విక్రయించాల్సి ఉంది. కానీ, కొత్త ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకురావడంతో అగనంపూడి డిపోలో టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758 చొప్పున విక్రయాలు చేపట్టారు. తరువాత రెండు డిపోల మధ్య రేటు తేడాను సరిచేసి రూ.1,076గా ఖరారు చేశారు. భీమిలిలో మరో పది వేల టన్నుల వరకు ఇసుక నిల్వలు ఉండగా, అగనంపూడిలో సుమారు 50 వేల నుంచి 60 వేల టన్నులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. రెండు డిపోల్లో ఇసుక పూర్తిగా అమ్మేసిన తరువాత వాటిని మూసివేస్తారు. డిపోలతో పనిలేకుండా నేరుగా రీచ్‌ల నుంచి ... మిగతా 6వ పేజీలో

మేయర్ పీఠంపై గురి



జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఘన విజయంతో కూటమి నేతల్లో ఉత్సాహం

మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యేంత వరకూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదన్న చట్టానికి సవరణ చేయాలని ప్రభుత్వ పెద్దలకు వినతి
- వచ్చే మంత్రిమండలి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం
- మేయర్ మార్పు ఖాయమంటున్న టీడీపీ కార్పొరేటర్లు
- త్వరలో వైసీపీ నుంచి మరో 15 మంది వరకూ జంప్





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నేతల్లో ఉత్సాహం నింపింది. మూడున్నరేళ్లుగా స్టాండింగ్ కమిటీలో ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లేదనే నిరుత్సాహంతో ఉన్న నేతలు...ఇప్పుడు కమిటీలోని పది స్థానాలను కైవసం చేసుకున్నారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. కౌన్సిల్‌లో పూర్తిస్థాయి మెజారిటీ సంపాదించడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలుగా చట్టసవరణ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈసారి జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారుల్లో ప్రచారం జరుగుతోంది.

మూడున్నరేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 59 వార్డులను దక్కించుకోవడంతో జీవీఎంసీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండడంతో ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురితో పాటు టీడీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన ముగ్గురు వైసీపీలో చేరిపోయారు. దీంతో జీవీఎంసీలో వైసీపీ తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. అప్పటి నుంచి మూడుసార్లు జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అన్ని స్థానాలను వైసీపీ కార్పొరేటర్లే గెలుచుకుంటూ వచ్చారు. స్టాండింగ్ కమిటీతోపాటు కౌన్సిల్ సమావేశాల్లో కూడా వైసీపీ నేతలు తాము అనుకున్న అంశాలను ఎజెండాలో చేర్చి విపక్షాల అభ్యంతరాలను పట్టించుకోకుండా అడ్డగోలుగా ఆమోదింపజేసుకునేవారు. కానీ రెండు నెలల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో జీవీఎంసీలో రాజకీయసమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసీపీ నుంచి కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి టీడీపీ, జనసేనలో చేరిపోవడం మొదలుపెట్టారు. కౌన్సిల్ ఏర్పడినప్పుడు 65 మంది కార్పొరేటర్లు కలిగిన వైసీపీ బలం బుధవారం స్టాండింగ్ కమిటీ ఎన్నికల సమయానికి 43కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థులకు 43 ఓట్లు కచ్చితంగా పడతాయని భావించిన వైసీపీ నేతలకు ఫలితాలు వెల్లడి తర్వాత దిమ్మతిరిగిపోయింది. ఎన్నిక జరడానికి ముందురోజు ఆ పార్టీ ఏర్పాటుచేసిన శిబిరంలో 43 మంది పాల్గొంటే, వైసీపీ నుంచి పోటీ చేసిన ఒక అభ్యర్థికి కేవలం 21, మరొకరికి 25 ఓట్లు మాత్రమే లభించడం ఆ పార్టీ నేతలను షాక్‌కు గురిచేసింది. వైసీపీ శిబిరానికి హాజరైన వారిలో సగం మంది కూటమి అభ్యర్థులకే ఓటేయడంతో వారంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. కనీసం 15 మంది కార్పొరేటర్లు త్వరలో టీడీపీ, జనసేనలో చేరిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీని దక్కించుకున్న ఊపులోనే మేయర్ పీఠాన్ని కూడా చేజిక్కించుకోవాలని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు, నేతలు భావిస్తున్నారు. అయితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో ఆ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వంలోని పెద్దలను కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ... మిగతా 6వ పేజీలో

పోరాడినా దక్కని ఫలితం

- 'ఒలింపిక్స్' రెపిఛేజ్ హీట్‌లో ఎర్రాజీ జ్యోతికి నాలుగో స్థానం
- సెమీస్ ఆశలు గల్లంతు



విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 8: పారిస్ ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి నిరాశ పరిచింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో సెమీస్‌కు చేరడంలో విఫలమైంది. గురువారం జరిగిన రెపిఛేజ్ రౌండ్ హీట్-1 రేస్‌లో నాలుగో స్థానంలో నిలవడంతో సెమీస్‌కు చేరే అవకాశం కోల్పోయింది. రెపిఛేజ్ హీట్‌లో ఎనిమిదో లేన్‌లో పరుగు తీసిన జ్యోతి తన రేస్‌ను 13.17 సెకన్లలో పూర్తిచేసింది. బుధవారం జరిగిన రౌండ్-1 హీట్స్‌లో 13.16 సెకన్లలో రేస్‌ను పూర్తిచేసి ఏడో స్థానంలో నిలిచిన జ్యోతి...గురువారం రెపి ఛేజ్ హీట్‌లో రేస్‌ను 13.17 సెకన్లలో పూర్తిచేయడం గమనించదగ్గ విషయం. రౌండ్-1 హీట్‌తో పోల్చితే 0.1 సెకండ్ వెనుకబడింది. రెపిఛేజ్ హీట్‌లో 12.87 సెకన్లతో రేస్‌ను పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికాకు మారియోన్ ఫౌరీతోపాటు 12.87 సెకన్లతో ద్వితీయ స్థానం సాధించిన నెదర్లాండ్స్ హర్డలర్ మేకాట్లిన్ ఎలిమ్ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించారు. ఫిన్‌లాండ్‌లోని జివాస్కిలో జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.78 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పిన ఎర్రాజీ జ్యోతి...ఒలింపిక్స్‌లో ఆ టైమింగ్‌ను అందుకోలేకపోయింది. అయితే విశ్వ క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొన్న తొలి భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పిన ఎర్రాజీ జ్యోతి...దేశానికి పతకం అందించేందుకు చూపిన ప్రతిభ అభినందనీయం.

పాఠశాలల ఎన్నికలు ప్రశాంతం

యాజమాన్య కమిటీలు ఏర్పాటు

- జిల్లాలో మొత్తం పాఠశాలలు 595
- కోరం లేకపోవడంతో తొమ్మిదిచోట్ల వాయిదా
- మిగిలిన 586 పాఠశాలల్లో 403 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవం
- 183 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణ
- మెజారిటీ పాఠశాలల్లో కూటమి సానుభూతిపరులకే కమిటీ పగ్గాలు



సీతమ్మధార ఎన్‌ఎంసీ స్కూలులో పాఠశాల కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో గల పాఠశాలల్లో యాజమాన్య కమిటీలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఒకటి, రెండుచోట్ల స్వల్ప వివాదాలు చోటుచేసుకోవడంతో పోలీసులు, విద్యా శాఖ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. జిల్లాలో మొత్తం 595 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో గురువారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు తరగతికి ముగ్గురిని సభ్యులుగా (విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి) ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. తరగతిలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో సగం మంది హాజరైతేనే కోరం ఉన్నట్టుగా పరిగణించి ఎన్నిక నిర్వహించారు. జిల్లాలో 595 పాఠశాలల్లో తొమ్మిదిచోట్ల కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశారు. ఆనందపురం మండలంలో వెల్లంకి ప్రాథమిక పాఠశాల, భీమిలి పరిధిలోని మజ్జివలస, జీరుపేట ప్రాథమిక పాఠశాలలు, పెందుర్తి మండలంలో జుత్తాడ జడ్పీ ఉన్నత పాఠశాల, పెదనరవ బీసీ గురుకుల ... మిగతా 6వ పేజీలో

పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

గతంలో వారంలోగా లభ్యం...ప్రస్తుతం 20 రోజుల సమయం

ఇతర జిల్లాల నుంచి దరఖాస్తుల వెల్లువ

- సాఫ్ట్‌వేర్ 2.0 వెర్షన్ అప్‌డేట్ నేపథ్యంలో స్లాట్లు కేటాయింపు, వెరిఫికేషన్ ఆలస్యం
- త్వరలో అరకులోయ పోస్టాఫీస్‌లో పీఎస్‌కే





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాస్‌పోర్టు స్లాట్లకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. గతంలో నెల రోజులకు గానీ స్లాట్ దొరకడం లేదని గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టి వారం రోజుల్లోనే స్లాట్ దొరికేలా చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ 15 రోజులు ఆగితే గాని స్లాట్ లభించడం లేదు. విదేశాంగ శాఖ పాస్‌పోర్టుల జారీ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుతం వెర్షన్ 2.0 అప్‌డేట్ చేస్తున్నారు. ఎక్కడైతే ఈ సాఫ్ట్‌వేర్ ప్రాసెస్‌లో ఉందో అక్కడ పాస్‌పోర్టుల స్లాట్లు, వెరిఫికేషన్, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దాంతో ఆ ప్రాంతానికి చెందిన వారు ఎక్కడ స్లాట్ దొరికితే ఆ జిల్లాకు వెళ్లి వివరాలు సమర్పిస్తున్నారు.

విశాఖపట్నం పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నగరంలోని బొత్స స్క్వేర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, ఎలమంచిలి, కాకినాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, కాకినాడల్లోని జిల్లా హెడ్ పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే భీమవరంలో లఘు కేంద్రం నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో రోజుకు 410 వరకు స్లాట్లు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఎవరైనా ఇక్కడ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇరవై రోజుల వ్యవధిలో స్లాట్ దొరుకుతోంది. అయితే గుంటూరుతో పాటు మరికొన్ని జిల్లాలలో తక్కువ సమయంలో స్లాట్ అందుబాటులో లేకపోవడంతో వారు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పోస్టాఫీసు కేంద్రాలకు వస్తున్నారు. అదేవిధంగా ఒడిశా నుంచి కూడా చాలామంది ఇక్కడ దరఖాస్తు చేసుకుంటున్నారు. అక్కడ కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నందున ... మిగతా 6వ పేజీలో

వస్త్ర దుకాణంలో మందుల విక్రయం!

- డ్రగ్ కంట్రోల్, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి
- మత్తు మందులతో పాటు అబార్షన్ కిట్లు స్వాధీనం



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మహారాణిపేట/గోపాలపట్నం, ఆగస్టు 8:
వస్త్ర దుకాణం ముసుగులో మత్తు మందులు, అబార్షన్ కిట్లను విక్రయిస్తున్న వ్యవహారం నగర పరిధిలోని గోపాలపట్నం బాజీ జంక్షన్‌లో వెలుగుచూసింది. సిటీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు గురువారం గోపాలపట్నం బాజీ జంక్షన్ వద్ద గల కేకే సిల్క్ వస్త్ర దుకాణంపై దాడి చేశారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా అల్ప్రాజోలమ్ వంటి మత్తును కలిగించే మందులు, అంగస్తంభనకు వినియోగించే మందులతో పాటు అబార్షన్ కోసం వినియోగించే కిట్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వీటిని అక్రమంగా విక్రయిస్తున్న మల్లిపూడి హరికృష్ణను అదుపులోకి తీసుకుని డ్రగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మందులు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, వెనుక ఎవరెవరున్నారనే దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

కాగా ఇలాంటి మందులను కేవలం వైద్యుల ... మిగతా 6వ పేజీలో

కొండవాలు ఆక్రమణ!

- బాకూరుపాలెంలో సుమారు 25 ఎకరాల మేర చదునుచేసిన పెద్దలు
- రైతుల ముసుగులో తతంగం
- అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు



బాకూరుపాలెంలో సుమారు 25 ఎకరాల మేర చదునుచేసిన కొండవాలు ప్రాంతం

విశాఖపట్నం/ఆనందపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):
ఆనందపురం మండలం బాకూరుపాలెం కొండపై పెద్దల కన్నుపడింది. రైతుల ముసుగులో కొందరు నాలుగైదు రోజులుగా కొండవాలు ప్రాంతంలో యంత్రాలను వినియోగించి చదునుచేయడం స్థానికంగా కలకలం రేపింది. బాకూరుపాలెం సర్వే నంబరు 3లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో కొండ, వాలు విస్తరించి ఉన్నాయి. దానికి ఆనుకుని రైతులకు జిరాయితీ భూములు ఉండగా కొందరు తోటలు పెంచుకుంటున్నారు. అయితే కొందరు తమ చెందిన జిరాయితీ భూములకు ఆనుకుని కొండవాలును ప్రొక్లెయినర్లతో నాలుగైదు రోజుల నుంచి తవ్వి మామిడి, నీలగిగి మొక్కలు నాటుతున్నారు. సుమారు 20 నుంచి పాతిక ఎకరాల వరకు చదును చేసి తోటల పెంపకానికి సిద్ధం చేసుకున్నారు. అయితే రైతుల వెనుక కొందరు పెద్దలు, రియల్టర్లు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులే స్వయంగా నాలుగైదు ప్రొక్లెయినర్లతో పనులు చేసే అవకాశం లేదని, వారి వెనుక కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నారనే వాదన వినిపిస్తోంది. నీలకుండీలు జంక్షన్ నుంచి విజయనగరానికి వెళ్లే రోడ్డులో ఉన్న బాకూరుపాలెం కొండవాలు ప్రాంతంలో ఎకరా రూ.కోటిన్నర నుంచి రూ.రెండు కోట్ల ... మిగతా 6వ పేజీలో

యాక్టివ్‌గా ఉండే రౌడీషీటర్ నగరంలో ఉండకూడదు : సీపీ - వార్త I పేజీలో


భానోజీపేటలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు


కమిటీ సభ్యులతో జ్ఞానాపురం ఉపాధ్యాయులు


ఎస్‌జీజీఓఎస్ కాలనీ ఉన్నత పాఠశాల కమిటీ

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 8: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పన విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా తల్లిదండ్రులు కృషిచేయాలని రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర రావు అన్నారు. గురువారం పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. పి.శాంతి కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఎంఈఓ 1 పైడపునాయుడు, ఎంఈఓ 2 బి.పుష్పరాగం, ఏఎంఓ జి.లక్ష్మి పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, రాంబాబు, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంజీఎం పాఠశాలలో...

జ్ఞానాపురం: స్థానిక మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఛైర్మన్‌గా ఎం.అప్పలరాజు, వైస్ ఛైర్మన్ కె.మనీషా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు.

ఎంవీడీ ఉన్నత పాఠశాలలో...

మహారాణిపేట: దండుబజారు ఎంవీడీ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు హెచ్‌ఎం బి.జనార్దనరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. ఛైర్మన్‌గా పి.అప్పన్న వైస్ ఛైర్మన్‌గా వంకా కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేశారు.

సీతంపేట ప్రాంతంలో

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా జె.ఉషా, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. పిఅండ్‌టి కాలనీ ఎస్ఎంసిహెచ్ జీవీఎంసీ స్కూల్‌లో హెచ్‌ఎం రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా మీసాల ఇందిర, వైస్ ఛైర్మన్‌గా పోతల రుతి, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

కంచరపాలెం పరిధిలో...

కంచరపాలెం: ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కె.మర్రిపాలెం, కప్పరాడ తదితర పాఠశాలల్లో పాఠశాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక జరిగింది. హెచ్‌ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్పీపేట సభ్యులను స్టాండింగ్ కమిటీసభ్యుడు 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ అభినందించారు. హెచ్‌ఎంలు ఆర్.శ్రీనివాస రావు, పి.మేరీజచింత, తాళ్ల శ్రీనివాసరావు, పీఎస్ఎన్ మూర్తి, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో...

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26, 42, 43 వార్డుల్లోని జీవీఎంసీప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 26వ వార్డు ఎస్‌జీజీఓస్ కాలనీలోని ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా వంగల అప్పలరాజు, వైస్ ఛైర్‌పర్సన్‌గా బోనెల ఉషారాణి ఎన్నికయ్యారు. హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఏజే జ్యోతి, కె.మాణిక్యం, ఎంవీధర్మారావు, పి.లలిత, ఎ.రామలక్ష్మి, వి.పద్మలత, డి.నిర్మల, ఎంఎస్‌వి విశ్వనాథం, ఎ.సునంద్ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల ఛైర్‌పర్సన్‌గా ఎస్‌కే సాఫియా, వైస్ ఛైర్‌పర్సన్‌గా పి.నాగమణిలను ఎన్నుకున్నారు. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల ఛైర్‌పర్సన్‌గా బి.నందిని, వైస్‌ఛైర్‌పర్సన్‌గా వై.సుకుమమారిలను ఎన్నుకున్నారు.


దండుబజారు పాఠశాలలో ప్రమాణం చేస్తున్న కమిటీ


సీతంపేట మధురానగర్‌లో ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం


ఆర్పీపేట హైస్కూల్ కమిటీతో కార్పొరేటర్ రాజశేఖర్

'స్టాండింగ్ కమిటీ విజయంలో సీతంరాజు కృషి'


స్టాండింగ్ కమిటీ సభ్యులు, సీతంరాజు సుధాకర్‌ను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మహారాణిపేట, ఆగస్టు 8: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ చేసిన కృషి పార్టీకి మంచి విజయాన్నందించిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావులు అత్యధిక ఓట్ల మెజారిటీ సాధించారన్నారు. కార్యక్రమంలో నేతలు కండిపల్లి సతీష్ కుమార్ చొల్లంగి శేఖర్ పల్లా రాధ, సింగంపల్లి కొండలరావు, వెంకట్, కిలాని కుమారి పసుపులేటి అప్పలరాజు, వెన్న శ్రీను, గౌతమ్, సుమతి, దుర్గా, జానకి, రమాదేవి, భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విల్లూరికి వర్తక సంఘం సత్కారం

పూర్ణామార్కెట్, ఆగస్టు 8: గ్రేటర్ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికవడంతో గురువారం పలువురు సత్కరించారు. పూర్ణామార్కెట్ శ్రీవరసిద్ధివినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్, మైనారిటీ నాయకులు, శ్రేణులు అభినందించారు.


విల్లూరిని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి: సీపీ

కంచరపాలెం, ఆగస్టు 8: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలతో పాటు ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని ఆదేశించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధులు, కుటుంబ సమస్యలు ఎదురైతే సిబ్బంది నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్.ఐ. రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ బాగ్చీ

నరసింహనగర్‌లో అనధికార దుకాణం తొలగింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డుపై అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని గురువారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఇటీవల ఈ ప్రాంతంలో అనుమతి లేకుండా బడ్డీని ఏర్పాటు చేయడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి తొలగించారు.


దుకాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. జగన్నాథపురం, నందగిరినగర్, చెక్కుడురాయి బిల్డింగ్, శ్రీనివాసనగర్, చాకలిపేట, హరగోపాల్ స్కూల్, కరుణామయి బంకు, తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారి, 28వ నంబరు బస్టాప్ రోడ్డు, రైల్వే క్వార్టర్స్, రైల్వేన్యూకాలనీ జంక్షన్, న్యూకాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కంచరపాలెం ప్రాంతంలో...

కంచరపాలెం: శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీకే నాయుడు తెలిపారు. గవర కంచరపాలెం, దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, సుభాష్‌నగర్, తుమ్మడిపాలెం, గొల్లకంచరపాలెం, గోకుల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో..

సీతమ్మధార: పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాలు, రసపూర్ణ ప్రాంతం, గాంధీనగర్ ఏరియా, సునీత నర్సింగ్ హోమ్, పోస్ట్ ఆఫీస్, సత్యం జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు.

13న ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ జయంతి

డాబాగార్డెన్స్, ఆగస్టు 8: ప్రపంచ మేటి సినీ దర్శకుడు హిచ్‌కాక్ జయంతిని ఈనెల 13న నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. 18, 19 శతాబ్దంలో తన చిత్రాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే అతనిని మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పిలుస్తారన్నారు. ఆయన గొప్పతనాన్ని నేటి యువతకు తెలిపేందుకు ఆయన 125వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఫిల్మ్ సొసైటీ నిర్ణయించిందన్నారు. ఈ నెల 13న మంగళవారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రత్యేక సమావేశం హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన ఇంగ్లీష్ చిత్రం ది బర్డ్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సినీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతోనే సంతృప్తి లభిస్తుందని డీఎల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్మిక నాయకుడు డీఎల్ రెడ్డి వర్థంతి సందర్భంగా గురువారం అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ, దొండపర్తి, రైల్వేస్టేషన్, కప్పరాడలో పండ్లు, బిర్యాని ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణకాంత్‌రెడ్డి, జానకిరామ్, జయకుమార్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇండియన్ బ్యాంక్ వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ఇండియన్ బ్యాంకు ఉద్యోగులు

సీతమ్మధార, ఆగస్టు 8: ఇండియన్ బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం వాకథాన్ నిర్వహించారు. డిపాజిట్ల సమీకరణ కోసం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆర్‌కె బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకథాన్‌ను ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్‌కుమార్ పుర్బే ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

మహారాణిపేట, ఆగస్టు 8: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి నట్టు జేసీఐ జాతీయ అధ్యక్షుడు రికేష్ శర్మ తెలిపారు. గురువారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జేసీఐ సంస్థ ఆధ్వర్యంలో వంద మంది సభ్యులు రక్తదానం చేశారన్నారు. మాదక ద్రవ్యాల నివారణపై ప్రజలలో అవగాహన కలిగించే విధంగా బీచ్ రోడ్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించామని తెలిపారు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నాలుగువేలమంది పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందజేశామన్నారు. వాయిస్ ఆఫ్ యూత్ పేరిట విద్యార్థుల్లో దేశభక్తి రేకెత్తించే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు గొంపా సురేష్, కేవీ రావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రికేష్ శర్మ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అల్లిపురం, ఆగస్టు 8: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. గురువారం అల్లిపురం ప్రాంతంలోని నేరెళ్ల కోనేరు, పండా వీధి, చలువతోట ప్రాంతాల్లో జనసేన నేతలతో కలిసి పర్యటించారు. వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు పూడికలతో నిండిపోతున్నాయని, వాటిని తొలగించేలా పారిశుధ్య సిబ్బంది కృషిచేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాశీరావుకు సూచించారు. జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట బాలకృష్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠంపై గురి

... 5వ పేజీ తరువాయి

అనేక స్థానిక సంస్థల్లో ఇదే పరిస్థితి ఉన్నందున...అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీ కాలం పూర్తవ్వాలనే చట్టాన్ని సవరించే అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు. మంత్రిమండలి ఆమోదిస్తే వెంటనే గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించి, తర్వాత జరిగే శాసనసభ సమావేశాల్లో ఆ అంశాన్ని ర్యాటిఫికేషన్ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆర్డినెన్స్ జారీ అయితే వెంటనే కౌన్సిల్ సమావేశం పెట్టి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఖాయమని జీవీఎంసీ అధికారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిల్‌లో ఇప్పటికే కూటమి తిరుగులేని ఆధిక్యం సంపాదించినందున అదే రోజు కొత్త మేయర్‌ను ఎన్నుకోవడం ఖాయమని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఊహించని పరాభవం ఎదురైందనే బాధలో ఉన్న వైసీపీ నేతలు, కార్పొరేటర్లకు మేయర్ మార్పు అంశం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

ఇసుక డోర్ డెలివరీ

... 5వ పేజీ తరువాయి

నిర్మాణదారుడి ఇంటికి డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న రేటు కంటే తక్కువకే ఇసుక లభించే అవకాశం ఉందంటున్నారు. దీనిపై గనుల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ చర్చించారు. విశాఖ జిల్లా వాసుల కోసం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా ఒక రీచ్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేకంగా రీచ్ కేటాయిస్తే ఇప్పుడున్న రేటు కంటే తక్కువగా డోర్ డెలివరీ చేయవచ్చునని అంచనా వేస్తున్నారు.

పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఇక్కడికి వస్తున్నారని పాస్‌పోర్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

6 నెలల సెలవులో అధికారిణి

విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసర్ బుధవారం నుంచి ఆరు నెలల మెటర్నటీ లీవులో వెళ్లారు. అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు గ్రాంటింగ్ ప్రక్రియ కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. అధికారుల సంఖ్య తగ్గడం వల్ల అన్నీ పరిశీలించి చూసుకోవలసి ఉంటుందని చెబుతున్నారు. గతంలో పీఎస్‌కేలో వివరాలు సమర్పించిన తరువాత మూడు రోజుల్లోనే పోలీస్ వెరిఫికేషన్ పూర్తయి ఇంకో మూడు రోజుల్లో పాస్‌పోర్టు ఇంటికి వచ్చేది. అంటే వారం రోజుల్లోనే ప్రక్రియ పూర్తయ్యేది. ఇప్పుడు కాసింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తిగా దరఖాస్తుదారు నేపథ్యంపై ఆధారపడి ఉంటుందని, ఎటువంటి కేసులు, ఇబ్బందికర సమాచారం లేకపోతే వారం నుంచి పది రోజుల్లో పాస్‌పోర్టు వస్తుందని చెబుతున్నారు. జిల్లా కేంద్రాల్లో డిమాండ్‌ను బట్టి రోజుకు 40 నుంచి 80 వరకు స్లాట్లు ఇస్తున్నారు.

అరకులోయ పోస్టాఫీసులో పీఎస్‌కే?

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రజలకు పాస్‌పోర్టు కేంద్రం అందుబాటులో లేదు. వారు విశాఖపట్నమో, ఎలమంచిలో వెళ్లాల్సి వస్తోంది. గతంలో అరకులోయ ఎంపీగా పనిచేసిన వారు ఓ సేవా కేంద్రం పెట్టాలని కోరడంతో అధికారులు ప్రాసెస్ ప్రారంభించారు. ట్రయల్ విధానంలో అరకులోయలో పోస్టాఫీసు సేవా కేంద్రం పెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది.

పాఠశాలల ఎన్నికలు ప్రశాంతం

... 5వ పేజీ తరువాయి

పాఠశాల, చినగదిలిలో సింహాచలం బీసీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ చిల్డ్రన్ హోమ్, పద్మనాభం మండలంలో అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాల, కొత్త కొవ్వాడ యూపీ పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు.

మొత్తం 586 పాఠశాలల్లో 403 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవం కాగా, 183 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. తరగతుల వారీగా హాజరైన తల్లిదండ్రులు చేతులెత్తడం ద్వారా ముగ్గురేసి సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యుల ఎన్నికల ముగిసిన తరువాత మధ్యాహ్నం కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద పాఠశాలగా గుర్తింపుపొందిన చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నిక నిర్వహించారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల కమిటీలో మెజారిటీ సభ్యులు కూటమి సానుభూతిపరులుగా చెబుతున్నారు. ఎక్కువ పాఠశాలల్లో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారే కమిటీలకు ఎన్నికయ్యారు. కొన్నిచోట్ల వైసీపీ సానుభూతిపరులు పోటీ చేశారు. కాగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కమిటీలు పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, బాలికా విద్య అభివృద్ధిలోనూ, డ్రాపౌట్స్ లేకుండా చేయడంలో కృషిచేయాలని కోరారు.

వస్త్ర దుకాణంలో మందుల విక్రయం!

... 5వ పేజీ తరువాయి

ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే విక్రయిస్తారని, లేదంటే తీవ్ర దుష్ప్రభావాలు ఎదురవుతాయన్నారు. లైసెన్స్ కలిగిన మెడికల్ దుకాణాల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంటుందన్నారు. ఔషధ నియంత్రణ డీసీ లక్ష్మీషా ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా నగరంలో మత్తుమందులు, ఇతర నిషేధ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ ఆదేశాలతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ఆక్రమణ!

... 5వ పేజీ తరువాయి

వరకూ పలుకుతుందని స్థానికులు చెబుతున్నారు. కొండవాలు ప్రాంతాన్ని చదును చేసి మొక్కలు నాటుతున్న విషయం తెలుసుకున్న ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్ నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది గురువారం బాకూరుపాలెం సందర్శించారు. అక్కడ మొక్కలు నాటుతున్న విషయం గుర్తించారు. ట్రేలలో ఉన్న మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నాటిన మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు. కొండవాలులో ప్రభుత్వ భూములకు సంబంధించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. వీఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మురుగునీటితో నిండిన సర్వీసు రోడ్డు

» బిర్లా జంక్షన్ వద్ద కాలువ నిర్మించినా ఫలితం శూన్యం

మురళీనగర్, ఆగస్టు 8: గ్రేటరు 50వ వార్డులోని బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో చేపడుతున్న కాలువల మరమ్మతులు ఫలితాన్ని ఇవ్వలేదు. హైవేను ఆనుకుని ఉన్న కాలువలు దెబ్బతినడంతో సర్వీస్ రోడ్డంతా మురుగు నీరు వ్యాపిస్తోంది. ఆరు నెలల కిందట ఇక్కడి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద కాలువలునిర్మించారు. వాటిపై జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది అందంగా డివైడర్ నిర్మించి అక్కడి ఓ షోరూంకి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చేశారు. దీని వల్ల జనాలకు ప్రయోజనం లేకపోతోంది. సర్వీసు రోడ్డులో పొంగి పొర్లుతున్న కాలువలు ప్రధాన సమస్యగా మారింది. సమస్యను వదిలి జీవీఎంసీ ఇంజనీరింగ్ నిపుణులు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్, జోనల్ అధికారులు రోడ్డుని ఆనుకొని ఉన్న షోరూంకి మేలు జరిగేలా పనులు చేపట్టడంపై ఇటుగా నిత్యం ప్రయాణాలు సాగించేవారు విమర్శిస్తున్నారు. 50వ వార్డులో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఇదో సాక్ష్యం. రూ. లక్షలతో పనులు చేపట్టినా సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఎగువ మురళీనగర్ సెక్టార్ల నివాసిత ప్రాంతాలు సహా, సాయిరాంనగర్, బిర్లా జంక్షన్ ప్రాంతాల నుంచి దిగువకు వస్తున్న మురుగు నీరు నిత్యం రోడ్డుని ముంచెత్తుతోంది. చిన్నపాటి వర్షం పడినా, రాకపోకలు నరకంగా మారుతున్నాయి. పెట్రోలు బంకు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పాస్‌పోర్టు సేవా కేంద్రం, హైవేలో ఫంక్షన్ హాల్, బార్‌ల ఎదుట మురుగునీటితో అవస్థలు తప్పడంలేదు. ప్రయాణికులు ఈ నీటిలోనే రాకపోకలకు సాగించాల్సి వస్తోంది. ఈ స్థితిలో ఇకనైనా జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రజోపయోగకరంగా అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


సర్వీసు రోడ్డుపై చేరిన మురుగు నీరు

వెలగని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు

- ప్రమాదాలకు నిలయంగా మారిన వడ్లపూడి జంక్షన్
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు, పాదచారులు
- అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



వడ్లపూడి జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు వెలగకపోవడంతో అస్తవ్యస్తంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



కూర్మన్నపాలెం, ఆగస్టు 8: వడ్లపూడి కూడలి వద్దనున్న ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు గత మూడు నెలలుగా మరమ్మతులకు గురవ్వడంతో ఈ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కూడలిలోని సిగ్నల్ లైట్లు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ మరింత అధికంగా ఉంటుం దని, చాలామంది వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండడంతో పాదచారులు రోడ్డు దాటేందుకు నానాపాట్లు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీ సులు విధులు నిర్వహిస్తున్నా పలువురు ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు నిబంధనలను అతిక్రమించి మితిమీరిన వేగాన్ని ప్రదర్శిస్తుండడంతో మిగిలిన వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ కూడలికి సమీపంలోనే పలు బ్యాంకులు, విద్యుత్ కార్యాలయం, పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, ఆస్పత్రులు, కల్యాణ మండపాలు, పాఠశాలలు, కళాశాలలు వంటివి ఉన్నాయి. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ఇక్కడకు సమీపంలోనే బెల్ట్ షాపులు, బార్‌ల్లో మద్యం సేవించి వస్తున్న పలువురు మందుబాబులు మత్తులో ఎటు వెళ్లాలో జోగుతూ ఉంటుండడం వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అందువల్ల అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ట్రాఫిల్ సిగ్నల్ వెలిగేలా తగిన చర్యలు చేపట్టడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి

-పి.వేణుబాబు, కణితి



వడ్లపూడి కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పని చేయకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిబంధనలు పాటించని వాహనదారుల వల్ల రోడ్డు దాటేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూడలిలో సిగ్నల్ లైట్లు వెలిగేలా అధికారులు చూడాలి.

దొంగలు బాబోయ్ దొంగలు!

నిఘా ఉన్నా ఉక్కు కర్మాగారంలో అధికమవుతున్న చోరీలు



ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 8: స్టీల్‌ప్లాంటులో రోజురోజుకు చోరీలు అధికమవుతున్నాయి. ప్లాంటులో పారిశ్రామిక భద్రత దళం, పోలీసులు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నా ఏదో ఒక విధంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారే ఎక్కువగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు న్నాయి. కొంతమంది అయితే కాంట్రాక్టు కార్మికులుగా కర్మాగారంలోకి వెళ్లి కొన్ని విభాగాల నుంచి ఇనుమును తస్కరించి ప్లాంట్ ప్రహరీ నుంచి బయటకు పడేస్తున్నారు. అదే సమయంలో వారికి సంబంధించిన కొంతమంది ప్రహరీ అవతల ఉంటూ ఏదైనా వాహనంలో ఆ ఇనుమును తరలిస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా కొంతమంది అతి తెలివిని ప్రదర్శిస్తూ ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనంలో ఐరన్, రాగి దిమ్మలను బయటకు తీసుకువస్తున్నట్టు తెలిసింది. అనుమానం వచ్చి సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకుంటే కటకటాలు లెక్కించాల్సి వస్తుంది. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లో ప్లాంట్ ప్రహరీకి ఫెన్సింగ్ లేకపోవడంతో దొంగలు సామగ్రిని బయటకు తీసుకురావడానికి సులువుగా ఉంది. చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరణ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 8: కేరళలోని వయనాడ్ బాధితుల సహాయార్థం గురువారం భెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. భెల్ మెయిన్ గేటు వద్ద కార్మిక నాయకులు జీటీపీ ప్రకాశ్, ఎస్.జగన్నాథరావు, పి.కనకారావు, కె.నారప రెడ్డి, తదితరులు 19 వేల రూపాయలను విరాళాలుగా సేకరించారు. మరిన్ని విరాళాలు సేకరించి బాధితుల సహాయార్థం అందజేస్తామని ప్రకాశ్ పేర్కొన్నారు.

ఏసీపీని కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 8: స్పెషల్ బ్రాంచి ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు ప్రభాకర్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బుధవారం నగరంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సంఘ కార్యాలయానికి రావాలని ఆహ్వానించారు. ఏసీపీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య ఎస్.మోహన్‌బాబు, పుల్లారావు, పైడికొండలరావు, ప్రసాద్, జాన్సన్ ఉన్నారు.



ఎస్ఈ శ్యాంబాబుకు లేఖను అందజేస్తున్న నాయకులు

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఈకి వినతి

అగనంపూడి, ఆగస్టు 8: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కూటమి నాయకులు ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబును కోరారు. స్థానికంగా విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సిఫార్సు చేసిన లేఖను ఎస్ఈకి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నివాసాలకు తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో లోవోల్టేజీ, అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందించి సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, వి.నారాయణరావు, కె.తాతారావు, తదితరులు ఉన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎయిర్‌పోర్టు సిబ్బంది

విమానాశ్రయంలో వాక్‌థాన్

గోపాలపట్నం, ఆగస్టు 8: విమానాశ్రయంలో నిర్వహిస్తున్న ఏవియేషన్ భద్రతా సంస్కృతి వారోత్సవాలను పురస్కరించుకుని విమాన ప్రయాణికుల భద్రతపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో వాక్‌థాన్ చేపట్టారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సిబ్బంది, సీఐఎస్ఎఫ్, ఎయిర్‌లైన్స్, ఎంటీటీ సిబ్బంది పాల్గొన్నారు. ఏవియేషన్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 11 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

ఎన్ఎస్‌టీఎల్‌లో రక్తదాన శిబిరం

గోపాలపట్నం, ఆగస్టు 8: ఎన్ఎస్‌టీఎల్ వ్యవస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్‌టీఎల్‌లో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా సిబ్బందికి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాముల్ని చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన 125 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

60వ వార్డులో రక్త పరీక్షలు

మల్కాపురం: గ్రేటర్ 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ-1లో జీవీఎంసీ వైద్య విభాగం ఆధ్వర్యంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. ఇటీవల ఓ మహిళ తీవ్ర జ్వరంతో మృతి చెందడంతో ఈ ప్రాంతంలో వైద్య సేవలు అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానికులకు రక్త పరీక్షలు చేశారు. అలాగే కాలనీ అంతా బ్లీచింగ్ చల్లడంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మలేరియా విభాగం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫ్రిజ్‌లను, నీల కుండీలను తనిఖీ చేశారు. అలాగే వైద్య శిబిరం నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

గాజువాక, ఆగస్టు 8: గాజువాక నియోజకవర్గంలోని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ-ఎస్ఎంటీ (పాఠశాల యాజమాన్య కమిటీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలోని ఆరు హైస్కూళ్లు, ఒక యూపీ పాఠశాల, 39 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అలాగే పెదగంట్యాడ మండలంలోని మూడు ఉన్నత పాఠశాలలు, 32 ప్రాథమిక, రెండు యూపీ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 18 ప్రాథమిక పాఠశాలలు, ఒక యూపీ పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఎన్నికను ప్రధానోపాధ్యాయురాలు లంక అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా చింతా మాధురి, ఉపాధ్యక్షురాలిగా బి.రాణి, కో-ఆప్షన్ సభ్యులుగా మజ్జి సోమేశ్, జయశంకర్, సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. అలాగే మల్కాపురం ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీని హెచ్ఎం పి.హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా శెట్టి సత్య, ఉపాధ్యక్షురాలిగా టి.తార, కో-ఆప్షన్, సభ్యులుగా పి.సతీశ్‌కుమార్, తదితరులు నియమితులయ్యారు. ఇండస్ట్రియల్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నిక హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఎం.తులసి. ఉపాధ్యక్షురాలిగా కె.కృప, సభ్యులుగా పలువురు నియమితులయ్యారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల కమిటీ ఎన్నిక హెచ్ఎం పద్మజ ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్‌గా ఎ.సలీమా, ఉపాధ్యక్షురాలిగా ఎస్.పావని ఎన్నికయ్యారు. కాగా 40వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నికను హెచ్ఎం భారతి నిర్వహించగా.. చైర్మన్‌గా జి.గౌతమి, ఉపాధ్యక్షురాలిగా ఎం.సుశీల ఎన్నికయ్యారు. ములగాడ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా కె.సుమతి, వైస్ చైర్మన్‌గా రాజు, కో-ఆప్షన్ సభ్యులుగా 'కోరమాండల్' ఉద్యోగి ఎస్.వెంకటరమణ, పి.వెంకటరమణ ఎన్నికయ్యారు. అలాగే మాజీ సైనికుల కాలనీలోని గ్రేటర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా మంత్రి రామలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా పార్వతి లక్ష్మీ గాయత్రి, కో-ఆప్షన్ సభ్యులుగా పీవీ రమణ, వెంకటరావు ఎన్నికయ్యారు.

పెందుర్తి: పాత పెందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షునిగా ఇద్దరి వ్యక్తుల మధ్య పోటీ నెలకొనడంతో ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి పర్యవేక్షణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఓటింగ్ నిర్వహించగా అధ్యక్షునిగా రాపేటి గణేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా గౌతమితో పాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీతో ఉపాధ్యాయుడు సీహెచ్ జగదీశ్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మండలంలోని సరిపల్లి జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా జి.సంతోశ్, ఉపాధ్యక్షురాలిగా కె.కనకమహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన సంతోష్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభినందించారు. కాగా రాంపురం జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా అపరంజిత, వైస్ చైర్మన్‌గా వి.శ్రీను ఎన్నికయ్యారు.



కణితి హై స్కూల్‌లో ఎస్ఎంటీ ఎన్నికను నిర్వహిస్తున్న దృశ్యం



కణితి హై స్కూల్‌లో ఎస్ఎంటీ ఎన్నికను నిర్వహిస్తున్న దృశ్యం



కొత్తగా ఎన్నికైన గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ (బాలురు) కమిటీ సభ్యులు

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి చింతలఅగ్రహారం ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బొడ్డేటి నూకరాజు ఎన్నికయ్యారు. హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, మద్దాల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ఎస్.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఎంటీ ఎన్నికలో చైర్మన్‌గా పి.కనకారావును, వైస్ చైర్మన్‌గా బి.భారతి, ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా కార్పొరేటర్ గుడివాడ అనూష, కో-ఆప్షన్ సభ్యులుగా సంద్రాన నూకరాజు, బొడ్డు రమణ ఎన్నికయ్యారు. మింది హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ నేతృత్వంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా డొక్కాడ అప్పలరాజు, ఉపాధ్యక్షురాలిగా జి.కుమారి ఎన్నికయ్యారు.

కూర్మన్నపాలెం: కణితి హైస్కూల్ ఎస్ఎంటీ ఎన్నికను హెచ్ఎం బి.సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా మడక దేవి, వైస్ చైర్మన్‌గా జి.శైలజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్మన్ దేవి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తానన్నారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఎన్నికను పర్యవేక్షించారు.

గోపాలపట్నం: గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ బాలుర పాఠశాల కమిటీ చైర్మన్‌గా కె.పార్వతి, వైస్ చైర్మన్‌గా బి.రవికాంత్ ఎన్నికయ్యారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ బాలికోన్నత పాఠశాల చైర్మన్‌గా ఎన్.సతీశ్, వైస్ చైర్మన్‌గా ఎస్.విజయలక్ష్మి, ఎల్లపువానిపాలెం జెడ్పీ హైస్కూల్ చైర్‌పర్సన్‌గా పి.గణేశమ్మ, వైస్ చైర్మన్‌గా కృష్ణ నాయక్, హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా వైసన్యాసిరావు, ఉపాధ్యక్షురాలిగా పి.కనకలక్ష్మి ఏకగ్రీవగా ఎన్నికయ్యారు. అలాగే నరవ జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా జె.నాగేంద్ర, వైస్ చైర్మన్‌గా జి.భవాని అలాగే పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

వేపగుంట: ఇక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా బళ్ల నాగమణి, వైస్ చైర్మన్‌గా డి.ఉషారాణి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా కె.పద్మావతి, ఎం.మహేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎన్.గంగాభాయ్, కో-ఆప్షన్ సభ్యులుగా ఎస్.దేముడు, ఎ.వెంకటరమణ, సభ్యులుగా కె.దేముడు, పి.లక్ష్మి, శ్రీదేవి, సునీల్‌బాబు, తదితరులు ఎన్నికయ్యారు. వీరికి కార్పొరేటర్ బళ్ల శ్రీనివాసరావు, హెచ్ఎం పద్మావతి అభినందనలు తెలిపారు. 94వ వార్డు సేనాతివానిపాలెం ప్రాథమిక పాఠశాల కమిటీ అధ్యక్షునిగా జి.నాగేశ్, కో-ఆప్షన్ సభ్యులుగా .నరసింహనాయుడు, చెల్లారావు, సభ్యులుగా రవి, లక్ష్మి, దేవి, తదితరులు ఎన్నికయ్యారు.

సింధియా: జీవీఎంసీ 40వవార్డులోని జీవీఎంసీ హైస్కూల్ కమిటీ ఎన్నిక హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్‌గా జి.గౌతమి, వైస్ చైర్మన్‌గా ఎం.సుశీల ఎన్నికయ్యారు. నూతన కమిటీని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్కరించారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 28, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 18, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 46, క్యాబేజీ 28, క్యారెట్ 30, దొండకాయలు 32, బంగాళదుంపలు 36, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 30, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

'ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి'

కూర్మన్నపాలెం, ఆగస్టు 8: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్రం చేయూతనిచ్చేలా కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,275వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామన్న ప్రకటన వచ్చేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఇటీవల ఇక్కడకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖామంత్రి స్టీల్‌ప్లాంటుకు ఎలా న్యాయం చేస్తారోనని కార్మికులంతా ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే మనందరి కర్తవ్యమన్నారు. పలువురు నాయకులు, సీఐటీయూ కార్మికులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సాయం



కాలనీవాసులకు నగదు అందజేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 8: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటుకు టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్య నారాయణ రూ.18 వేలను కాలనీ వాసులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల పార్టీ అని, ప్రజా సంక్షేమమే తెలుగుదేశం ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, సుబ్బయ్య, నూక అప్పారావు, నాగార్జున, వెంకటేష్, వెంకట అప్పారావు, తదితరులు ఉన్నారు.

పంచకర్లను కలిసిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

పెందుర్తి, ఆగస్టు 8: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును గురువారం నగరంలోని ఆయన స్వగృహంలో నరవ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పంచకర్లను కలిశారు.

ఘనంగా సత్యసాయికి నగర సంకీర్తన

అగనంపూడి, ఆగస్టు 8: అగనంపూడిలోని షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశాక నగర సంకీర్తనను ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సత్యసాయి భక్తులు పాల్గొని ఓంకారం, సుప్రభాతం, హనుమాన్ చాలీసా, సాయి నామాన్ని జపించారు. సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సత్యసాయి 99వ పుట్టు పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వ్యాసశర్మ, సత్యనారాయణ, పైడినాయుడు, సుబ్బారావు, రాజు, కిశోర్, పద్మ, లీలావతి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు ఛిద్రం: సీఐ ఎర్రంనాయుడు

కూర్మన్నపాలెం, ఆగస్టు 8: మత్తు పదార్థాలతో విద్యార్థుల జీవితాలు ఛిద్రమవుతాయని దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు అన్నారు. ఇక్కడి రామకృష్ణా హైస్కూల్‌లో గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పెనుముప్పుగా మారిన మాదకద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాల వల్ల పలువురు విద్యార్థులు నేరాలకు పాల్పడి జైలుశిక్ష అనుభవిస్తున్నారన్నారు. అందువల్ల విద్యార్థు లంతా నిర్దేశిత లక్ష్యాలతో చదువుకుని ఉన్నత స్థానా లకు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ లలితకుమారి, కరస్పాండెంట్ వాసుదేవరావులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రైతులంతా ఆధార్, ఫోన్ నంబర్లను అందజేయాలి

అగనంపూడి, ఆగస్టు 8: లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సభ్యత్వం ఉన్న రైతులంతా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు తమ మొబైల్ నంబర్లను తమ కార్యాలయంలో అందజేయాలని సంఘం ముఖ్య కార్యనిర్వహణ కార్యదర్శి పి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీసీబీఐ ఉన్నతాధికారులు, సొసైటీ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కె.రూన్సీరాణి ఆదేశాల మేరకు సంఘం సభ్యుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులంతా గమనించి తమకు సహకరించాలని కోరారు.

స్థాయీ సంఘ సభ్యురాలిగా ఎన్నికైన లక్ష్మీబాయికి సత్కారం

పెదగంట్యాడ, ఆగస్టు 8: స్థాయీ సంఘ సభ్యురాలిగా ఎన్నికైన 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయిని సీపీఐ మండల నాయకులు ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో సీపీఐ, టీడీపీ నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, పి.దుర్గారావు, వై.దేముళ్ళు, కె.రమేష్, పెంటయ్య, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా మోదీ పాలన

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్



సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం, ఆగస్టు 8: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగుతోందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ విమర్శించారు. మల్కాపురం గ్రామ మండలిలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టరును ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని వివక్ష వల్లే పార్లమెంటు భవన్ని రాష్ట్రపతితో ప్రారంభించ లేదన్నారు. ఈ నెల 13న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సులో అధిక సంఖ్యలో దళితులు పాల్గొనవలసిందిగా కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజులు, ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు, ఎం.జి.ఈశ్వరరావు, కామేశ్వరరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



భానోజీపేటలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు



కమిటీ సభ్యులతో జ్ఞానాపురం ఉపాధ్యాయులు



ఎన్‌జీజీఓఎస్ కాలనీ ఉన్నత పాఠశాల కమిటీ

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 8: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పన విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా తల్లిదండ్రులు కృషిచేయాలని రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర రావు అన్నారు. గురువారం పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. పి.శాంతి కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఎంఈఓ 1 పైడపునాయుడు, ఎంఈఓ 2 బి.పుష్పరాగం, ఏఎంఓ జి.లక్ష్మి పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, రాంబాబు, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంజీఎం పాఠశాలలో...

జ్ఞానాపురం: స్థానిక మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. చైర్మన్‌గా ఎం.అప్పలరాజు, వైస్ చైర్మన్ కె.మనీషా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు.

ఎంవీడీ ఉన్నత పాఠశాలలో...

మహారాణిపేట: దండుబజారు ఎంవీడీ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు హెచ్ఎం బి.జనార్దనరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్‌గా పి.అప్పన్న వైస్ చైర్మన్‌గా వంకా కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేశారు.

సీతంపేట ప్రాంతంలో

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా జె.ఉషా, వైస్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. పిఅండ్‌టి కాలనీ ఎన్ఎంసిహెచ్ జీవీఎంసీ స్కూల్‌లో హెచ్ఎం రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా మీసాల ఇందిర, వైస్ చైర్మన్‌గా పోతల రుతి, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

కంచరపాలెం పరిధిలో...

కంచరపాలెం: ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కె.మర్రిపాలెం, కప్పరాడ తదితర పాఠశాలల్లో పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిగింది. హెచ్ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్పీపేట సభ్యులను స్టాండింగ్ కమిటీసభ్యుడు 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ అభినందించారు. హెచ్ఎంలు ఆర్.శ్రీనివాసరావు, పి.మేరీజచింత, తాళ్ల శ్రీనివాసరావు, పీఎస్ఎన్ మూర్తి, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో...

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26, 42, 43 వార్డుల్లోని జీవీఎంసీప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా వంగల అప్పలరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా బోనెల ఉషారాణి ఎన్నికయ్యారు. హెచ్ఎం బి.లక్ష్మీ నరస వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఏజే జ్యోతి, కె.మాణిక్యం, ఎంవీధర్మారావు, పి.లలిత, ఎ.రామలక్ష్మి, పి.పద్మలత, డి.నిర్మల, ఎంఎస్‌వి విశ్వనాథం, ఎ.సునంద్ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా ఎస్‌కే సాఫియా, వైస్ చైర్‌పర్సన్‌గా పి.నాగమణిలను ఎన్నుకున్నారు. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా బి.నందిని, వైస్‌చైర్‌పర్సన్‌గా వై.సుకుమమారిలను ఎన్నుకున్నారు.



దండుబజారు పాఠశాలలో ప్రమాణం చేస్తున్న కమిటీ



సీతంపేట మధురానగర్‌లో ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం



ఆర్పీపేట హైస్కూల్ కమిటీతో కార్పొరేటర్ రాజశేఖర్

'స్టాండింగ్ కమిటీ విజయంలో సీతంరాజు కృషి'



స్టాండింగ్ కమిటీ సభ్యులు, సీతంరాజు సుధాకర్‌ను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మహారాణిపేట, ఆగస్టు 8: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ చేసిన కృషి పార్టీకి మంచి విజయాన్నందించిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావులు అత్యధిక ఓట్ల మెజారిటీ సాధించారన్నారు. కార్యక్రమంలో నేతలు కండిపల్లి సతీష్ కుమార్ చొల్లంగి శేఖర్ పల్లా రాధ, సింగంపల్లి కొండలరావు, వెంకట్, కిలాని కుమారి పసుపులేటి అప్పలరాజు, వెన్న శ్రీను, గౌతమ్, సుమతి, దుర్గా, జానకి, రమాదేవి, భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విల్లూరికి వర్తక సంఘం సత్కారం

పూర్ణామార్కెట్, ఆగస్టు 8: గ్రేటర్ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికవడంతో గురువారం పలువురు సత్కరించారు. పూర్ణామార్కెట్ శ్రీవరసిద్ధివినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్, మైనారిటీ నాయకులు, శ్రేణులు అభినందించారు.



విల్లూరిని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి: సీపీ

కంచరపాలెం, ఆగస్టు 8: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలతో పాటు ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని ఆదేశించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధులు, కుటుంబ సమస్యలు ఎదురైతే సిబ్బంది నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్ఐ. రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ బాగ్చీ

నరసింహనగర్‌లో అనధికార దుకాణం తొలగింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డుపై అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని గురువారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఇటీవల ఈ ప్రాంతంలో అనుమతి లేకుండా బడ్డీని ఏర్పాటు చేయడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి తొలగించారు.



దుకాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. జగన్నాథపురం, నందగిరినగర్, చెక్కుడురాయి బిల్డింగ్, శ్రీనివాసనగర్, చాకలిపేట, హరగోపాల్ స్కూల్, కరుణామయి బంకు, తాటిచెట్లపాలెం నాలుగు లేన్ల రహదారి, 28వ నంబరు బస్టాప్ రోడ్డు, రైల్వే క్వార్టర్స్, రైల్వేన్యూకాలనీ జంక్షన్, న్యూకాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కంచరపాలెం ప్రాంతంలో...

కంచరపాలెం: శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీకే నాయుడు తెలిపారు. గవర కంచరపాలెం, దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, సుభాష్‌నగర్, తుమ్మడిపాలెం, గొల్లకంచరపాలెం, గోకుల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో..

సీతమ్మధార: పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాలు, రసపూర్ల ప్రాంతం, గాంధీనగర్ ఏరియా, సునీత నర్సింగ్ హోమ్, పోస్ట్ ఆఫీస్, సత్యం జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు.

13న ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ జయంతి

డాబాగార్డెన్స్, ఆగస్టు 8: ప్రపంచ మేటి సినీ దర్శకుడు హిచ్‌కాక్ జయంతిని ఈనెల 13న నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. 18, 19 శతాబ్దంలో తన చిత్రాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే అతనిని మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పిలుస్తారన్నారు. ఆయన గొప్పతనాన్ని నేటి యువతకు తెలిపేందుకు ఆయన 125వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఫిల్మ్ సొసైటీ నిర్ణయించిందన్నారు. ఈ నెల 13న మంగళవారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రత్యేక సమావేశం హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన ఇంగ్లీష్ చిత్రం ది బర్డ్స్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సినీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

అక్కయ్యపాలెం, ఆగస్టు 8: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతోనే సంతృప్తి లభిస్తుందని డీఎల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి అన్నారు. కార్మిక నాయకుడు డీఎల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ, దొండపర్తి, రైల్వేస్టేషన్, కప్పరాడలో పండ్లు, బిర్యాని ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణకాంత్‌రెడ్డి, జానకిరామ్, జయకుమార్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇండియన్ బ్యాంక్ వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ఇండియన్ బ్యాంకు ఉద్యోగులు

సీతమ్మధార, ఆగస్టు 8: ఇండియన్ బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం వాకథాన్ నిర్వహించారు. డిపాజిట్ల సమీకరణ కోసం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆర్‌కె బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకథాన్‌ను ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవధేష్‌కుమార్ పుర్బే ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

మహారాణిపేట, ఆగస్టు 8: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా 75 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు జేసీఐ జాతీయ అధ్యక్షుడు రికేష్ శర్మ తెలిపారు. గురువారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జేసీఐ సంస్థ ఆధ్వర్యంలో వంద మంది సభ్యులు రక్తదానం చేశారన్నారు. మాదక ద్రవ్యాల నివారణపై ప్రజలలో అవగాహన కలిగించే విధంగా బీచ్ రోడ్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించామని తెలిపారు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నాలుగువేలమంది పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందజేశామన్నారు. వాయిస్ ఆఫ్ యూత్ పేరిట విద్యార్థుల్లో దేశభక్తి రేకెత్తించే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు గొంపా సురేష్, కేవీ రావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రికేష్ శర్మ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అల్లిపురం, ఆగస్టు 8: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. గురువారం అల్లిపురం ప్రాంతంలోని నేరెళ్ల కోనేరు, పండా వీధి, చలువతోట ప్రాంతాల్లో జనసేన నేతలతో కలిసి పర్యటించారు. వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు పూడికలతో నిండిపోతున్నాయని, వాటిని తొలగించేలా పారిశుధ్య సిబ్బంది కృషిచేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాశీరావుకు సూచించారు. జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట బాలకృష్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠంపై గురి

... 5వ పేజీ తరువాయి

అనేక స్థానిక సంస్థల్లో ఇదే పరిస్థితి ఉన్నందున...అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీ కాలం పూర్తవ్వాలనే చట్టాన్ని సవరించే అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని కూటమి నేతలు చెబుతున్నారు. మంత్రిమండలి ఆమోదిస్తే వెంటనే గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ జారీచేయించి, తర్వాత జరిగే శాసనసభ సమావేశాల్లో ఆ అంశాన్ని ర్యాటిఫికేషన్ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆర్డినెన్స్ జారీ అయితే వెంటనే కౌన్సిల్ సమావేశం పెట్టి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఖాయమని జీవీఎంసీ అధికారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిల్‌లో ఇప్పటికే కూటమి తిరుగులేని ఆధిక్యం సంపాదించినందున అదే రోజు కొత్త మేయర్‌ను ఎన్నుకోవడం ఖాయమని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఊహించని పరాభవం ఎదురైందనే బాధలో ఉన్న వైసీపీ నేతలు, కార్పొరేటర్లకు మేయర్ మార్పు అంశం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

ఇసుక డోర్ డెలివరీ

... 5వ పేజీ తరువాయి

నిర్మాణదారుడి ఇంటికి డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న రేటు కంటే తక్కువకే ఇసుక లభించే అవకాశం ఉందంటున్నారు. దీనిపై గనుల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ చర్చించారు. విశాఖ జిల్లా వాసుల కోసం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా ఒక రీచ్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేకంగా రీచ్ కేటాయిస్తే ఇప్పుడున్న రేటు కంటే తక్కువగా డోర్ డెలివరీ చేయవచ్చునని అంచనా వేస్తున్నారు.

పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఇక్కడికి వస్తున్నారని పాస్‌పోర్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

6 నెలల సెలవులో అధికారిణి

విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసర్ బుధవారం నుంచి ఆరు నెలల మెటర్నటీ లీవులో వెళ్లారు. అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు గ్రాంటింగ్ ప్రక్రియ కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. అధికారుల సంఖ్య తగ్గడం వల్ల అన్నీ పరిశీలించి చూసుకోవలసి ఉంటుందని చెబుతున్నారు. గతంలో పీఎస్‌కేలో వివరాలు సమర్పించిన తరువాత మూడు రోజుల్లోనే పోలీస్ వెరిఫికేషన్ పూర్తయి ఇంకో మూడు రోజుల్లో పాస్‌పోర్టు ఇంటికి వచ్చేది. అంటే వారం రోజుల్లోనే ప్రక్రియ పూర్తయ్యేది. ఇప్పుడు కాసింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తిగా దరఖాస్తుదారు నేపథ్యంపై ఆధారపడి ఉంటుందని, ఎటువంటి కేసులు, ఇబ్బందికర సమాచారం లేకపోతే వారం నుంచి పది రోజుల్లో పాస్‌పోర్టు వస్తుందని చెబుతున్నారు. జిల్లా కేంద్రాల్లో డిమాండ్‌ను బట్టి రోజుకు 40 నుంచి 80 వరకు స్లాట్లు ఇస్తున్నారు.

అరకులోయ పోస్టాఫీసులో పీఎస్‌కే?

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రజలకు పాస్‌పోర్టు కేంద్రం అందుబాటులో లేదు. వారు విశాఖపట్నమో, ఎలమంచిలో వెళ్లాల్సి వస్తోంది. గతంలో అరకులోయ ఎంపీగా పనిచేసిన వారు ఓ సేవా కేంద్రం పెట్టాలని కోరడంతో అధికారులు ప్రాసెస్ ప్రారంభించారు. ట్రయల్ విధానంలో అరకులోయలో పోస్టాఫీసు సేవా కేంద్రం పెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది.

పాఠశాలల ఎన్నికలు ప్రశాంతం

... 5వ పేజీ తరువాయి

పాఠశాల, చినగదిలిలో సింహాచలం బీసీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ చిల్డ్రన్ హోమ్, పద్మనాభం మండలంలో అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాల, కొత్త కొవ్వాడ యూపీ పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు.

మొత్తం 586 పాఠశాలల్లో 403 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవం కాగా, 183 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. తరగతుల వారీగా హాజరైన తల్లిదండ్రులు చేతులెత్తడం ద్వారా ముగ్గురేసి సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యుల ఎన్నికల ముగిసిన తరువాత మధ్యాహ్నం కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద పాఠశాలగా గుర్తింపుపొందిన చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నిక నిర్వహించారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల కమిటీలో మెజారిటీ సభ్యులు కూటమి సానుభూతిపరులుగా చెబుతున్నారు. ఎక్కువ పాఠశాలల్లో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారే కమిటీలకు ఎన్నికయ్యారు. కొన్నిచోట్ల వైసీపీ సానుభూతిపరులు పోటీ చేశారు. కాగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కమిటీలు పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, బాలికా విద్య అభివృద్ధిలోనూ, డ్రాపౌట్స్ లేకుండా చేయడంలో కృషిచేయాలని కోరారు.

వస్త్ర దుకాణంలో మందుల విక్రయం!

... 5వ పేజీ తరువాయి

ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే విక్రయిస్తారని, లేదంటే తీవ్ర దుష్ప్రభావాలు ఎదురవుతాయన్నారు. లైసెన్స్ కలిగిన మెడికల్ దుకాణాల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంటుందన్నారు. ఔషధ నియంత్రణ డీసీ లక్ష్మీషా ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా నగరంలో మత్తుమందులు, ఇతర నిషేధ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ ఆదేశాలతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ఆక్రమణ!

... 5వ పేజీ తరువాయి

వరకూ పలుకుతుందని స్థానికులు చెబుతున్నారు. కొండవాలు ప్రాంతాన్ని చదును చేసి మొక్కలు నాటుతున్న విషయం తెలుసుకున్న ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్ నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది గురువారం బాకూరుపాలెం సందర్శించారు. అక్కడ మొక్కలు నాటుతున్న విషయం గుర్తించారు. ట్రేలలో ఉన్న మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నాటిన మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు. కొండవాలులో ప్రభుత్వ భూములకు సంబంధించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. వీఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మురుగునీటితో నిండిన సర్వీసు రోడ్డు

▸▸ బిర్లా జంక్షన్ వద్ద కాలువ నిర్మించినా ఫలితం శూన్యం

మురళీనగర్, ఆగస్టు 8: గ్రేటరు 50వ వార్డులోని బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో చేపడుతున్న కాలువల మరమ్మతులు ఫలితాన్ని ఇవ్వలేదు. హైవేను ఆనుకుని ఉన్న కాలువలు దెబ్బతినడంతో సర్వీస్ రోడ్డంతా మురుగు నీరు వ్యాపిస్తోంది. ఆరు నెలల కిందట ఇక్కడి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద కాలువలునిర్మించారు. వాటిపై జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది అందంగా డివైడర్ నిర్మించి అక్కడి ఓ షోరూంకి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చేశారు. దీని వల్ల జనాలకు ప్రయోజనం లేకపోతోంది. సర్వీసు రోడ్డులో పొంగి పొర్లుతున్న కాలువలు ప్రధాన సమస్యగా మారింది. సమస్యను వదిలి జీవీఎంసీ ఇంజనీరింగ్ నిపుణులు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్, జోనల్ అధికారులు రోడ్డుని ఆనుకొని ఉన్న షోరూంకి మేలు జరిగేలా పనులు చేపట్టడంపై ఇటుగా నిత్యం ప్రయాణాలు సాగించే వారు విమర్శిస్తున్నారు. 50వ వార్డులో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఇదో సాక్ష్యం. రూ. లక్షలతో పనులు చేపట్టినా సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఎగువ మురళీనగర్ సెక్టార్ల నివాసిత ప్రాంతాలు సహా, సాయిరాంనగర్, బిర్లా జంక్షన్ ప్రాంతాల నుంచి దిగువకు వస్తున్న మురుగు నీరు నిత్యం రోడ్డుని ముంచెత్తుతోంది. చిన్నపాటి వర్షం పడినా, రాకపోకలు నరకంగా మారుతున్నాయి. పెట్రోలు బంకు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పాస్‌పోర్టు సేవా కేంద్రం, హైవేలో ఫంక్షన్ హాల్, బార్‌ల ఎదుట మురుగునీటితో అవస్థలు తప్పడంలేదు. ప్రయాణికులు ఈ నీటిలోనే రాకపోకలకు సాగించాల్సి వస్తోంది. ఈ స్థితిలో ఇకనైనా జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రజోపయోగకరంగా అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



సర్వీసు రోడ్డుపై చేరిన మురుగు నీరు



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఆగస్టు 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసిన తరువాత బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క స్వర్ణ సంపెంగతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఆగస్టు 8 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని 11 కేవీ వుడాకాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోర్టు కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, సుద్ద గెడ్డ ప్రాంతం, వాంబేకాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

తగరపువలసలో..

తగరపువలస : చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం : పట్టణంలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. 33 కేవీ భీమిలి-చిప్పాడ, 11 కేవీ ఉప్పాడ ఫీడర్ నిర్వహణలో భాగంగా సోమన్నపాలెం, రెడ్డీలపాలెం, కాపుల దిబ్బడిపాలెం, కె. నగరపాలెం, మంగమారిపేట, జగనన్న కాలనీ, వుడా అపార్ట్‌మెంట్స్, బ్యాంక్ కాలనీ, తాతాజీనగర్, ఎల్లమ్మపేట, మహాలక్ష్మీపురం, డెక్కటిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకద్దు గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.



కొమ్మాది : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు ఎన్నికైన సభ్యులు



పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో శివరాణి, పోలీసుల విచారణ



తోటగరువు ఉన్నత పాఠశాలకు ఎన్నికైన సభ్యులు

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు

- దాదాపుగా అన్నిచోట్లా ఏకగ్రీవం
- కొన్నిచోట్ల మాత్రమే ఓటింగ్
- కోరం లేక నాలుగు చోట్ల వాయిదా

భీమునిపట్నం, ఆగస్టు 8 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 66, ప్రాథమికోన్నత పాఠశాలలు 11, ఉన్నత పాఠశాలలు 21 ఉండగా మజ్జివలస, జీరుపేట మినహా మిగిలిన అన్నిచోట్లా ఎన్నికల నిర్వహణ పూర్తయింది. 47 ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 ఉన్నత పాఠశాలలు ఏకగ్రీవం కాగా మిగిలిన చోట్ల ఎన్నికలు జరిగాయి.

పండిట్ నెహ్రూ పాఠశాలలో రభస

పట్టణంలోని పండిట్ నెహ్రూ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఎన్నికలో రభస జరిగింది. పాఠశాల హెచ్‌ఎం సంతోష్ విద్యార్థుల తల్లిదండ్రులెవరూ రాకుండానే ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నిక రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. ఈ విషయం తెలిసిన ఎంఈఓ శివరాణి, పోలీసు హెచ్‌సీ సత్యనారాయణ పాఠశాలకు చేరుకున్నారు. ఎన్నిక నిర్వహణపై హెచ్‌ఎంను వివరణ కోరి, రికార్డులు పరిశీలించారు. మొత్తం ఓటర్లు 197 మందికి, 97 మంది హాజరయ్యారని వారితో చేతులెత్తి అంగీకారం తెలిపేలా ఎన్నిక నిర్వహించామని హెచ్‌ఎం వివరించారు. చైర్మన్‌గా అప్పికొండ బాలకృష్ణ, వైస్ చైర్మన్‌గా బూస లీలావతి ఎన్నికయ్యారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ ఇష్ట ప్రకారమే ఎన్నిక జరిగిందని చెప్పడంతో అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ నాయకులు వాళ్ల అభీష్టాన్ని తాము కూడా అంగీకరిస్తున్నామని చెప్పి వెళ్లిపోయారు. కాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికను నార్త్ ఏసీపీ సునీల్ పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ డి. రమేష్ ఉన్నారు.

ఆరిలోవ : ఆరిలోవలోని పలు పాఠశాలల్లోనూ ఎన్నికలు జరిగాయి. తోటగరువు ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎన్నిక మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. తొలుత తరగతుల వారీగా ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక చేతులు పైకి ఎత్తడం ద్వారా ఓటింగ్ పద్ధతిలో చేపట్టారు. చైర్మన్‌గా చుక్కా జాన్ ప్రసాద్, వైస్ చైర్మన్‌గా కె. పావనీ కుమారి గెలుపొందారు. విజేతలతో హెచ్‌ఎం దుర్గా భవానీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, గాడి సత్యం పాల్గొన్నారు. శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాల చైర్మన్‌గా గంగరాజు, వైస్ చైర్మన్‌గా నీలవేణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిన్సిపాల్ వంకర రత్నవల్లి తెలిపారు.పైనాపిల్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా మొదల్లవలస రాజేశ్వరి, వైస్ చైర్మన్‌గా బొగ హేమలత ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు హెచ్‌ఎం రామరాజు చెప్పారు.సంతపాలెం స్కూల్ కమిటీ ఎన్నిక కూడా ఏకగ్రీవమైంది. పాత ఆరిలోవ స్కూల్ కమిటీ చైర్మన్ గా వై. సాయికుమార్, వైస్ చైర్మన్‌గా కృష్ణకుమారి, పెదగదిలి స్కూల్ కమిటీ చైర్మన్‌గా అలజంగి శ్రావణి, వైస్ చైర్మన్‌గా కాటా సంతోషి ఎన్నికైనట్టు హెచ్‌ఎం రవికాంత్ తెలిపారు.

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక పాఠశాల హెచ్‌ఎం వానపల్లి శైలజ ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్‌గా దేవి, వైస్ చైర్మన్‌గా కృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జోన్నాడ భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా రాళ్లపాటి తులసీ, సింహాచలం మార్కెట్‌లోని ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా లక్ష్మీ, విజినిగిరిపాలెం ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా కె. సత్యనారాయణ, సింహాచలనగర్ ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా శివకృష్ణ, అప్పన్నపాలెం ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా సంతోష్‌కుమార్, గోశాల లేఅవుట్‌లోని ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా డి. స్వప్న ఎన్నికయ్యారు. గెలుపొందిన వారంతా కూటమి పార్టీల సానుభూతిపరులు కావడంతో కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్, జనసేన వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు అభినందనలు తెలిపారు.

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా పడాల స్వాతి, వైస్ చైర్మన్‌గా వై. మున్నీష, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొమ్మాది : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో చైర్మన్‌గా జి. అచ్చుతరావు, వైస్ చైర్మన్‌గా నూకరత్నం ఎన్నికయ్యారు. డిప్యూటీ డీఈఓ సువర్ణ, ఎంఈఓలు రవీంద్రబాబు, అనురాధ ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించారు.



పద్మనాభంలో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు

ఆనందపురం : మండలంలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గిడిజాల, శొంఠ్యాం, బోయిపాలెం హైస్కూళ్లు, వెల్లంకి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు ఎన్నికలు జరగ్గా మిగిలిన పాఠశాలలన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఆనందపురం హైస్కూల్‌కు చైర్మన్‌గా బంటుపల్లి లక్ష్మీ, వైస్ చైర్మన్‌గా ఆకుల రమణ ఎన్నికయ్యారు. గండిగుండంలో చైర్మన్‌గా గొంతిన కుమారి, వైస్ చైర్మన్‌గా కరకాన గంగరాజు ఎన్నికయ్యారు.

పెదవాల్తేరు : ఈస్టు పాయింట్ కాలనీలో ఉన్న కేడీపీఎం హైస్కూల్లో త్రీ టౌన్ సీఐ పార్థసారథి, హెచ్ ఎం సుమతి బాయి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా అల్లు వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కొత్తలింక మాధవి ఎన్నికయ్యారు.

ఎంవీపీ కాలనీ : అప్పుఘర్ సమీపంలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. షేక్ జరీనా చైర్మన్‌గా, ఇ. కొండమ్మ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్టు హెచ్‌ఎం తెలిపారు.

పద్మనాభం/పద్మనాభం రూరల్ : మండలంలో 61 పాఠశాలలకు గాను 59 చోట్ల ఎన్నికయ్యాయి. వీటిలో 49 ప్రాథమిక పాఠశాలు, 8 ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, కేజీబీవీకి ఎన్నిక పూర్తి కాగా, అనంతవరం హైస్కూల్, కొత్తకొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాలల ఎన్నికలు వాయిదా పడ్డాయి. వాటికి ఎన్నికలు ఎప్పుడు జరిగేది త్వరలో చెబుతామని హెచ్‌ఎంలు చెప్పారు.

ఆక్రమిత స్థలంలో రెవెన్యూ సర్వే

సాగర్‌నగర్, ఆగస్టు 8 : పెద్ద రుషికొండ ఐటీ హబ్ కూడలి బీచ్ రోడ్డుకు ఆనుకుని ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ యంత్రాంగం,ఆక్రమణకు పాల్పడిన వారు గురువారం జాయింట్ సర్వే నిర్వహించారు. ఇప్పటికే ఆ భూమిలో అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన విషయం విధితమే. జాయింట్ సర్వేలో ఏడు వందల గజాలు ఆక్రమణకు గురైనట్టు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు.

ఈ-పంట నమోదు పరిశీలన

పద్మనాభం, ఆగస్టు 8 : ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్న పంటల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి గురువారం పలు గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసిన ప్రతి రైతును ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు.

క్రీడాకారిణి దీక్షితకు సన్మానం

పెదవాల్తేరు, ఆగస్టు 8 : క్రీడాకారిణి చార్లెస్ దీక్షిత ప్రియ జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద కుమార్ అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాకేష్ చంద్ర ఆధ్వర్యంలో దీక్షితను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో దీక్షిత ప్రతిభ చూపడడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 28, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 18, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 46, క్యాబేజి 28, క్యారెట్ 30, దొండకాయలు 32, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 52, అల్లం (పాతది) 140, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 40, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 30, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 8 : టీడీపీ ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఉన్న వసతులను తిరిగి కల్పించాలని ఏయూ ఉద్యోగులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. గురువారం వారు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రతి నెలా 1న జీతాలు, పింఛన్లు పొందేవారమని వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేదన్నారు. శాశ్వత ఉద్యోగులకు పదోన్నతులు సీనియారిటీ ప్రకారం వర్తింపచేయాలని, ఉద్యోగులందరికీ ఏయూ ఆసుపత్రి నుంచి మందులను పునరుద్ధరించాలని, టైమ్ స్కేల్ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డొక్కర శ్రీనివాస్, మల్లేష్ రెడ్డి, నాగరాజు, రమేష్, జగన్, రంగనాయకులు, ఒమ్మి శ్రీను, రమేష్, నరసింగరావు, నారాయణరావు పాల్గొన్నారు.



వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న ఏయూ ఉద్యోగులు

బాలిక నిహారికకు వెలగపూడి పరామర్శ

పెదవాల్తేరు : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట వాల్తేరు డిపో సమీపంలో ఉంటున్న చింతపల్లి నిహారిక (8)ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పరామర్శించారు. బాలిక తండ్రి చిన్నా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి ముత్తి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. నిహారిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన నగరంలోని ఆంధ్రా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆపరేషన్ చేయించారు. ఈమేరకు ఆస్పత్రికి వెళ్లి బాలికను పరామర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ సేవలు చిరస్మరణీయం

మద్దిలపాలెం, ఆగస్టు 8 : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకుడు పీతల అప్పారావు కొనియాడారు. పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయంలో గురువారం బుద్ధదేవ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి : ఎస్‌ఐ

సింహాచలం, ఆగస్టు 8 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోపాలపట్నం శాంతిభద్రతల విభాగం ఎస్‌ఐ అప్పలనాయుడు సూచించారు. గురు వారం ఆయన అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి అనేక మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని కోరారు.

అప్పన్న ఆలయానికి శ్రావణ శోభ



సింహాచలం, ఆగస్టు 8 : శ్రావణ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని పలు రకాల పూలతో సుందరంగా అలంకరించారు. శ్రావణ పూజలకు వచ్చే భక్తులకు కనువిందు చేసేలా ఆలయ పరిసరాలను బంతి పువ్వుల మాలలు వేలాడదీసి, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

తాటితూరులో న్యాయ అవగాహన సదస్సు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 8 : తాటితూరు సచివాలయంలో జిల్లా న్యాయ స్థానానికి చెందిన న్యాయాధిపతులు, పోలీసుల ఆధ్వర్యంలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలన్నది అధికారులు స్థానికులకు వివరించారు.

విద్యాభివృద్ధికి స్కూల్ కమిటీలు దోహదం

భీమునిపట్నం, ఆగస్టు 8 : విద్యాభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీలు ఎంతో దోహదం చేస్తాయని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి అన్నారు. గురువారం ఆమె బ్యాంక్ కాలనీలో వున్న రాయిపాలెం ఉన్నత పాఠశాలను సందర్శించి, ఏపీ గ్రీన్ కార్పొరేషన్ కార్యక్రమంలో మాట్లాడారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

భీమునిపట్నం, ఆగస్టు 8 : బీచ్‌రోడ్ ఎస్‌ఓఎస్ జంక్షన్‌లో వున్న సీ హార్స్ రెస్టారెంట్ వెనుక వున్న బే ఆఫ్ బెంగాల్‌కు చెందిన ప్రదేశంలో మృతదేహాలను పూడ్చడం, దహనం చేయడం నిషేధమని హెచ్చరిస్తూ జీవీఎంసీ అధికారులు గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్సీ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ పిటిషనర్ సీ హార్స్ హైకోర్టును ఆశ్రయించారని, కోర్టు సంబంధిత స్థలంలో మృతదేహాలను పూడ్చడాన్ని, దహనం చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు.

గంభీరం జలాశయం వద్ద..

ఆనందపురం, ఆగస్టు 8 : గంభీరం జలాశయం వద్ద వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. జలాశయంలో పడి ఇటీవల ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో మళ్లీ అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పర్యాటకులను అప్రమత్తం చేస్తూ ఈబోర్డులు ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్, మేము సైతం సేవా సంఘం అధ్యక్షుడు అక్కిరెడ్డి దేముడుబాబు తెలిపారు.

గురుకులంలో వైద్య శిబిరం

భీమునిపట్నం, ఆగస్టు 8 : పట్టణంలోని బాలికల గురుకులంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. భీమిలి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు బాలికలను పరీక్షించి, మందులు అందజేశారు.



ఎమ్మెల్యే గంటాను సన్మానిస్తున్న సంకల్ప సేవా సమితి సభ్యులు

స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవాలి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 8 : పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. నగరంలోని ఎంవీపీ కాలనీలో సంకల్ప సేవా సమితి సభ్యులు గురువారం గంటాను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిని విద్యలో ఆదుకోవాలన్నారు. 13 ఏళ్లుగా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కొమ్మన శ్రీనివాసరావు, అందే మహేష్, దాసరి సురేష్‌బాబు, ఎం. శివ, ఎస్.మాధవరావు, ఎస్వీ సత్యనారాయణ, తిరుపతినాయుడు, బి. సత్యనారాయణ, బొచ్చ సురేష్‌కుమార్, స్వరూప్, తలాటం వీర రాఘవరావు, మేడిది రాజశేఖర్, హరిప్రసాద్, అడబాల నాని పాల్గొన్నారు.

'అవినీతిపై యువత పోరాటం చేయాలి'

భీమునిపట్నం, ఆగస్టు 8 : సమాజంలోని అవినీతి, అక్రమాలు, అసమానతలపై యువత పోరాటం చేయాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి పిలుపునిచ్చారు. గురువారం ఆ కళాశాలలో క్విట్ ఇండియా ఉద్యమ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా సమాజంలో ఇంకా కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. డైట్ అధ్యాపకుడు జీజీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంలో నాయకులు చేసిన త్యాగాన్ని వివరించారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు క్విట్ ఇండియా, క్విట్ డ్రగ్స్ నినాదంలో పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమయాజులు, గొట్టేటి రవి, ఎం. మహాలక్ష్మి, జె. మాధవి, పి. హరిణి పాల్గొన్నారు.